క్లుప్తంగా

ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం
– వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జీవీ సుబ్బయ్య



ప్రొద్దుటూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జీవీ.సుబ్బయ్య అన్నారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు వెంకటేశ్వరరావు టీడీపీ కోవర్టుగా మారి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 23మంది ఎమ్మెల్యేలను టీడీపీలోకి నయనో, భయానో చేర్చింది నిజమా కాదా అని ప్రశ్నించారు. 2017లో టీడీపీ ప్రభుత్వంలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇంటలిజెన్స్ వింగ్‌లో ఉండి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. సర్వేలెన్స్ ఎక్విప్‌మెంట్స్ కొనడానికి మీ కుమారుడు చేతన కృష్ణ కంపెనీకి ఇచ్చిన ఆర్డర్‌పై ప్రాసిక్యూట్ చేయమని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు.

వైద్య పరికరాల వితరణ
మైదుకూరు : మండలంలోని వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థానిక ఎస్బీఐ అధికారులు రూ.2లక్షలు విలువైన ఫర్నీచర్, వైద్య పరికరాలను మంగళవారం వితరణ చేశారు. అవేర్ గ్రూప్ కింద ఆస్పత్రికి మందుల ర్యాకులు, డాప్లర్ మిషన్, బీపీ ఆపరేటర్లు, బేబి వామర్, వాటర్ ప్యూరిఫైయర్, స్ట్రెచర్ తదితర వస్తువులను ఎస్బీఐ రీజనల్ మేనేజర్ శ్రీవాణి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి తేజ్‌దీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పీవీ సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేటలో..

ఖాజీపేట : ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవసరమున్న పరికరాలు వితరణ రూపంలో అందాయి. ఖాజీపేట ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో అవేర్ గ్రూప్ నుంచి వెయిటింగ్ కుర్చీలు 4, లేబర్ రూమ్‌టేబుల్, వీల్ చైర్లు 2, వాటర్ ప్యూరిఫైర్, బీపీ మిషన్‌లు 2, ఐవీ స్టాండ్ 4, మంచాలు 6, స్ట్రెచర్‌లు మొత్తం సుమారు రూ.2లక్షల విలువైన పరికరాలను ఖాజీపేట ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి డాక్టర్ ఆయూషా సుల్తానాకు అందించారు. ఈ సందర్భంగా కడప ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీవాణి కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి పరికరాలను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అవేర్ గ్రూప్ సభ్యులు మాధవన్, వరుణ్‌తో పాటు స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయండి
మైదుకూరు : మైదుకూరులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులు మానికింది వెంకటేశ్, రఘు, భాస్కర్, శ్యామ్ తదితరులు కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న చిన్న విగ్రహం స్థానంలో ప్రభుత్వ నిధులతో అధికారులు పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం ఉన్న ప్రదేశంలో కాకుండా బస్‌షెల్టర్ వెనక వైపున అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.

అదనపు సమన్వయకర్త పరామర్శ
బద్వేలు అర్బన్ : ఇటీవల మోకాలు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బద్వేలు జెడ్పీటీసీ వంకెలచిన్న పోలిరెడ్డి తల్లి నారాయణమ్మను మంగళవారం మండల పరిధిలోని గొడుగునూరులో గల ఆమె నివాసంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరువిశ్వనాథరెడ్డి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్యుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద పోలిరెడ్డి, వైస్ ఎంపీపీ బుట్టినరసింహారెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆయా పంచాయతీల నాయకులు చిదానందంరెడ్డి, జయసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన
గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె, అడుసువారిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి మాధురి రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది బాదుల్లా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సునంద, జ్యోతిపాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన
గోపవరం : మండలంలోని రాచాయపేటలో మంగళవారం నిర్వహించిన జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. దూడలను పరిశీలించి మొదటి, రెండవ, మూడవ బహుమతులను దూడల యజమానులకు జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ శారదమ్మ బహుమతి అందజేశారు. ఏడీఏ నాగభూషణం, డాక్టర్ రమణయ్య, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ శిరీష, డాక్టర్ శరత్, పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మచ్చే కదా అని వదిలేస్తే.. ముప్పే

- ఇంటింటా కుష్టు నిర్ధారణ సర్వే
- మచ్చలుంటే చూపించాలంటున్న వైద్యులు
- 90కి పైగా బయటపడుతున్న అనుమానిత లక్షణాల

మీశరీరంపై స్పర్శలేని మచ్చలు, పొడలున్నాయా.. మచ్చలే కదా అని తేలిగ్గా తీసిపారేయొద్దు.. ఎందుకంటే ఆ మచ్చల తోనే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. శరీరంపై ఎక్కడ మచ్చలున్నా మొహమాటపడకుండా వైద్య సిబ్బందికి చూపించాలి. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కింద చేపట్టిన కార్యక్రమంలో వైద్యులకు తెలియజేయాలని చెబుతున్నారు.



ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది, అధికారులు



ఓ వ్యక్తి వీపుపై ఉన్న కుష్టు వ్యాధికి కారణమైన మచ్చలు (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధిని నిర్మూలించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ సిబ్బందిని పంపి వ్యాధి నిర్ధారణ సర్వే చేపట్టింది. అనుమానత మచ్చలు, పొడలు శరీరంపై ఉంటే నిర్భయంగా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి తెలియచేయాలని అధికారులు కోరుతున్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఆరుఅర్బన్ హెల్త్ సెంటర్లున్నాయి. ఇంటింటి సర్వేలో భాగంగా 1,86,102 మందిని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పరిశీలించనున్నారు. సోమవారం నుంచి ఈ కుష్టు నిర్ధారణ సర్వే ఫిబ్రవరి 2వతేదీ వరకు కొనసాగుతుంది. ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద వాలంటీర్లు సర్వే చేసేందుకు ఇంటింటికీ వెళ్తున్నారు. అవసరమైతే వైద్యాధికారులు సర్వేలో పాల్గొంటారు.

వివరాలన్నీ.. ఆరా తీస్తూ..

శరీరం మచ్చలు, అధిక మోతాదులో పొడలు ఉంటే సిబ్బంది వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తారు. వైద్యాధికారులు అనుమానిత లక్షణాలున్న వ్యక్తిని పరిశీలించి కుష్టు వ్యాధి అవునో.. కాదో నిర్ధారణ చేస్తారు. ఒక వేళ కుష్టుగా తేలితే సంబంధిత వ్యక్తి పేరును రిజిష్టర్ చేసుకొని చికిత్స ప్రారంభిస్తారు. కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియా లెప్రే వల్ల వస్తుంది. ఈ వ్యాధి పూర్వజన్మ శాపం వల్లనో, పాపం వల్లనో, వంశ పారంపర్యంగానూ సోకదు. రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ప్రతి నాలుగు నెలలకోసారి ఇంటింటి సర్వే చేయడంతోపాటు త్వరితగతిన వ్యాధిగ్రస్తులను కనుగొని చికిత్స ఇవ్వడం ద్వారా అంగ వైకల్యం రాకుండా కాపాడవచ్చు. వ్యాధి కారక బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన ఆరు నెలల నుంచి 5 ఏళ్ల లోపల వ్యాధి లక్షణాలు బయట పడతాయని వైద్యాధికారులు తెలిపారు. ప్రొద్దుటూరులో ప్రస్తుతం 13 కుష్టు కేసులున్నట్లు డీపీఎంఓ శివశంకరయ్య తెలిపారు. 2023–24లో 11 కొత్త కేసులు వచ్చాయన్నారు. సర్వే చేపట్టిన రెండు రోజుల్లో 180కి పైగా కుష్టు అనుమానిత కేసులను గుర్తించామని చెప్పారు.

కుష్టు వ్యాధి లక్షణాలు ఇవే..

- చర్మంపై పాలిపోయిన రాగివర్ణంతో కూడిన స్పర్శలేని మచ్చలుండడం
- కుష్టు వ్యాధి సంబంధిత మచ్చలపై చెమట పట్టకపోవడం
- కను బొమ్మలు లేదా వెంట్రుకలు రాలిపోవడం
- ముఖంపై చర్మం నూనె రాసినట్టు నిగనిగలాడుతుంది
- కాళ్లు, చేతులపై స్పర్శ జ్ఞానం లోపించడం
- ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం
- కాళ్లు చేతులు తిమ్మిర్లు, అరికాళ్లు, చేతులకు స్పర్శ లోపించడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారి పోవడం
- వేళ్లు వంకర్లు తిరగడం

ఎండీటీ మందులతో వ్యాధి నయమవుతుంది

బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) ద్వారా కుష్టు వ్యాధి పూర్తిగా నయమవ్వుతుంది. ప్రారంభ దశలో గుర్తించి సక్రమంగా చికిత్స చేయించుకుంటే వ్యాధి తోపాటు అంగ వైకల్యం రాకుండా నివారించవచ్చు. ఆరు నెలల నుంచి 12 నెలల పాటు ఎండీటీ మందులతో చికిత్స తీసుకుంటే కుష్టు పూర్తిగా నయమవుతుంది.

సిబ్బందికి సహకరించాలి



ఇంటింటి సర్వే చేయడానికి వస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి ప్రజలు సహకరించాలి. శరీరంపై ఎలాంటి మచ్చలున్నా మొహమాటం లేకుండా సిబ్బందికి చెప్పాలి. కుష్టు వ్యాధి నిర్ధారణ జరిగినా భయపడాల్సిన పని లేదు. ఎండీటీమందు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది.

– యం.శివశంకరయ్య, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్, ప్రొద్దుటూరు

కుష్టును పారద్రోలుదాం



ఒకప్పుడు కుష్టు పేరు వింటేనే భయపడేవారు. కానీ ఇప్పుడు అలా కాదు. ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో కుష్టు వ్యాధిని నివారించగలిగాం. అక్కడక్కడా కేసులు బయటపడుతున్నా ఎండీటీ మందులతో వ్యాధి పూర్తిగా నిర్మూలించగలుతున్నాం. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలి.

– డాక్టర్ పద్మిని, శ్రీనివాస నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, ప్రొద్దుటూరు

పార్టీ అభివృద్ధికి మరింత కృషి



హరికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

గోపవరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయనున్నట్లు జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ హరికృష్ణారెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఆమోదం మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ఆశీస్సుల మేరకు తనను జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీగా ఎంపిక చేయడం పట్ల వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్సీ హరికృష్ణారెడ్డిని శాలువా, పూలమాలతో సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుండి కొనసాగుతూ తన వంతు కృషి చేసిన హరికృష్ణారెడ్డి సేవలను గుర్తించి జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీగా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. దీంతో మరింత బాధ్యత పెరిగినట్లైందని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని హరికృష్ణారెడ్డి తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డిలను హరికృష్ణారెడ్డి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగసుబ్బారెడ్డి, మాజీ డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు రవికుమార్‌రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం



మాట్లాడుతున్న ఆర్టీఓ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో వాహనదారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన తర్వాత తగు పత్రాలతో డ్రైవింగ్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎల్‌ఎల్‌ఆర్ పొందిన నెలరోజుల తర్వాత డ్రైవింగ్ టెస్ట్ జరిపి లైసెన్స్ జారీ చేస్తామన్నారు. రహదారి పక్కన, మలుపు వద్ద కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాలను పార్కింగ్ చేయరాదని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ కరిముల్లా, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీకర్‌రెడ్డి, ఎంవీఐలు నారాయణ నాయక్, హేమకుమార్, రవీంద్రనాయక్, శ్రీనివాస రెడ్డి, వాహనదారులు పాల్గొన్నారు.

నేడు ఇంజినీరింగ్ విద్యార్థులతో వాక్‌థాన్

రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం మైదుకూరు రోడ్డులోని టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులతో వాక్‌థాన్ నిర్వహించ నున్నట్లు ఆర్టీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విద్యార్థులు, పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ అధికారులు పాల్గొననున్నట్లు చెప్పారు.

పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు



పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని మొండి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులు పెండింగ్‌లో ఉన్న టాప్ వంద మందిని గుర్తించి ఇప్పటికే నోటీసులు అందజేశామని తెలిపారు. 23 సచివాలయాల్లో పన్ను వసూళ్ల కొరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అక్రమ కుళాయి కనెక్షన్లను వీలైనంత త్వరగా రెగ్యులర్ చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పట్టణ పరిధిలోని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు కూడా పన్నులు బకాయి ఉన్నాయని సంబంధిత కార్యాలయాలకు నోటీసులు అందజేశామని, వీలైనంత త్వరగా ఉన్నతాధికారులతో మాట్లాడి బడ్జెట్ విడుదల చేయించుకుని పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ రఘునాథరెడ్డి, మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పశువులకు చికిత్స



చికిత్స చేస్తున్న ఏడీ గురివిరెడ్డి

మైదుకూరు : మండలంలోని సుంకులుగారిపల్లె, ముదిరెడ్డిపల్లె, సుగాలి తండా గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పశు వైద్య ఆరోగ్య శిబిరాల్లో పశువులకు వైద్యాధికారులు చికిత్సలు నిర్వహించారు. సుంకులగారిపల్లెలో 16 చూడి పశువులకు, 24 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 184 పశువులకు సాధారణ చికిత్సలను నిర్వహించారు. 38 దూడలకు, 86 పశువులకు, 18 జీవాలకు నట్టల నివారణ మందును తాపించారు. నారాయణ, దశరథరామిరెడ్డి, పశు వైద్య శాఖ ఏడీ గురివిరెడ్డి, జేవీఓ గోపినాథ్, వీహెచ్‌ఏలు సృజన్, అనిల్, రహమతుల్లా, ప్రవీణ,గోపాలమిత్రరమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నట్టల నివారణ మందును తాపించారు. వనిపెంట పశు వైద్యాధికారి సుధాకర్, జేవీఓ యశోద, ఏహెచ్‌ఏలు మీరావలీ, లావణ్య, మీరాకుమారి పాల్గొన్నారు.

ఖాజీపేట : రైతుల సంక్షేమం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ డాక్టర్ మురళీ రైతులకు సూచించారు. మంగళవారం చెన్నముక్కపల్లె, తుడుమలదిన్నె గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను పరిశీలించారు. పశువులు నివాసం ఉంటున్న పాకల్లో పరిశుభ్రతతో ఉండాలన్నారు. లేకపోతే పశువులకు అనేక వ్యాధులు సోకి తీవ్ర ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. డాక్టర్ రామచంద్రతోపాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

విప్లవయోధుడు కామ్రేడ్ లెనిన్



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్ : ప్రపంచానికి నూతన సమాజాన్ని పరిచయం చేసిన పోరాట యోధుడు కామ్రేడ్ లెనిన్ అని సీపీఎం పట్టణ నాయకులు ఎం.చిన్ని పేర్కొన్నారు. లెనిన్ 101వ వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారీ, బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా కారల్‌మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికను రచిస్తే దానిని అనుసరించి జార్ చక్రవర్తుల రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం సాగించి రష్యా విప్లవాన్ని సాధించిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. లెనిన్ పోరాటస్ఫూర్తిని ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మస్తాన్‌షరీఫ్, మోక్షమ్మ, ఖైరున్‌బీ, రాయప్ప, సుబ్బరాయుడు, పట్టణ నాయకులు బాలమ్మ, మస్తాన్‌బీ, ఆదిల్‌బాష, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ వీఓఏ ఎన్నిక



పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్నిక

చాపాడు : మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో మంగళవారం మహిళా సంఘాల వీఓఏ ఎన్నికను పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యురాళ్లు హాజీరా, సహదేవ అధ్యక్షతన గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం వీఓఏగా కుర్రాకు ఓబులమ్మను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గతంలో వీఓఏగా పని చేస్తున్న ఈశ్వరమ్మను తొలగించి ఆమె స్థానంలో కె.ఓబులమ్మను నియమించాలని కొన్ని సంఘాల లీడర్లు కోరగా, మరికొంత మంది లీడర్లు ఈశ్వరమ్మనే కొనసాగించాలన్నారు. దీంతో గ్రామ సమాఖ్య సమావేశం రసాభాసాకు దారి తీసింది. అనంతరం ఎస్ఐ చిన్న పెద్దయ్య తమ సిబ్బందితో కలసి ఎలాంటి గొడవలు జరుకుండా సమావేశం జరపాలని సూచించారు. ఈ సమావేశంలో 24 మంది మహిళా సంఘాల లీడర్లు ఉండాల్సి ఉండగా 21 మంది హాజరయ్యారు. వీరిలో 8 మంది సభ్యులు వీఓఏను తొలగించరాదని సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం 13 మంది సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీధర్, వెలుగు సీసీ జీవన్, సిబ్బంది నాగన్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



పట్టణంలో త్యాగరాజస్వామి ఆరాధన నిర్వహిస్తున్న నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : ప్రముఖ వాగ్గేయకారులు, స్వరనీరాజన చక్రవర్తి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నాయీబ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బద్వేలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో త్యాగరాజస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నగర సంకీర్తన ద్వారా పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ భారతీయ భక్తి సంప్రదాయానికి త్యాగరాజ కీర్తనలు పట్టుకొమ్మలన్నారు. ఆయన సృజించిన సాహిత్యం అపురూపం, అజరామరమన్నారు. నగర సంకీర్తనలో భాగంగా వాయిద్య కళాకారుల మంగళవాయిద్య విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు బ్రహ్మయ్య, రజనీకాంత్, గురుబ్రహ్మం, వెంకటసుబ్బయ్య, బాబు, మహేష్, ప్రసాద్, గురుస్వామి, సుబ్రమణ్యం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరికరాలతో వ్యవసాయం లాభదాయకం



అబ్బూసాహేబ్‌పేట గ్రామంలో డ్రోన్ స్ప్రేయర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ

అట్లూరు : రైతులు ఆధునిక పరికరాల ద్వారా వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తే లాభదాయకమని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు మండల పరిదిలోని అబ్బూసాహేబ్‌పేట గ్రామంలో అభ్యుదయ రైతు గోగుల రాధాకృష్ణయ్య సాగు చేసిన దేశీవాలి రకం వరికి వేపనూనె డ్రోన్ ద్వారా పిచికారి చేయించారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఒక ఎకరాకు పిచికారి చేయాలంటే 200 లీటర్లు నీటితో కలిపిన ద్రావణం అవసరం అన్నారు. అదే డ్రోన్ ద్వారా పిచికారి చేయడానికి 10 లీటర్ల నీటితో కలపిన ద్రావణం సరిపోతుందన్నారు. అలాగే డ్రోన్ స్ప్రేయర్ ద్వారా 10 నిమిషాలలో పిచికారి చేయవచ్చన్నారు. దీంతో కూలీల ఖర్చు, సమయం ఆదా, పిచికారీ సమయంలో విష సర్పాల భయం ఉండదన్నారు.

రాగిపంట పరిశీలన:

మండల పరిదిలోని తంబళ్లగొంది రైతు సేవాకేంద్రం పరిదిలోని బీబీ సాహేబ్‌పేట గ్రామంలో రైతులు సాగు చేసిన రాగి పంటను సోమవారం ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టరు కె.అంకయ్య కుమార్‌తో పాటు బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. నాగరాజ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో పకృతి వ్యవసాయ సిబ్బంది విజయశేఖర్, రాజేశ్, వెంకటేశ్వర్లు, రైతు సేవా సహాయకుడు సందీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

17 చౌకదుకాణాలకు 8 దరఖాస్తులు
చాపాడు : మండల వ్యాప్తంగా 17 చౌక దుకాణాలకు రేషన్ డీలర్ల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానించగా 6 చౌక దుకాణాలకు ఎనిమిది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దారు రమాకుమారి తెలిపారు. మండలంలోని విశ్వనాథపురం-1, మొర్రాయిపల్లె-1, పల్లవోలు-1, రాజువారిపేట-2, రాజుపాళెం-1, టీఓపల్లె-2 చొప్పున దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24న జమ్మలమడుగులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాత పరీక్ష ఉంటుందని అనంతరం ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేయని చౌకదుకాణాలకు ఇన్‌చార్జ్‌లు కొనసాగుతారని తహసీల్దారు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేసేవారికి గుర్తింపు
– మండల కన్వీనర్‌గా సీయం బాషా



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న సీఎం బాషా, తదితరులు

పోరుమామిళ్ల : పార్టీకి విధేయతగా ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేసేవారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. పట్టణానికి చెందిన సీయం బాషాను మూడవ దఫా మండల కన్వీనర్ పదవికి ఎంపిక చేస్తూ మంగళవారం అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చాయి. సీయం బాషా మంగళవారం రాత్రి పార్టీ కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని కలసి శాలువా, పూలమాల వేసి సత్కరించారు. తాను మూడవసారి కన్వీనర్‌గా ఎంపిక కావడానికి ఎమ్మెల్సీ గారి సహకారం, కృషి ఉందని బాషా అన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, యువనేత ఆదిత్యారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటి కప్పుడు ఎండగట్టాలన్నారు. పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు రాజీవ్‌బాష, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి, ఎంపీటీసీలు ఇస్సాక్, ముర్తుజ, గురప్ప, వెంకటేశ్వర్లు, నాయకులు రవిచంద్రారెడ్డి, హుసేన్‌పీరా, నాయబ్, పుల్లారెడ్డి, నారాయణరెడ్డి, శివయ్య, సీతారామిరెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డి, సాయి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు
బి.కోడూరు : మండలంలోని పది పంచాయతీల పరిధిలో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపేస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలకు, ఆశా కార్యకర్తలకు వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాల్లో కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి తగు మందులను ఉచితంగా పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లెప్రసీ నోడల్‌పర్సన్ జాన్‌విలియం, పీహెచ్ఎన్ పుష్పాంజలి, సీహెచ్ఓ నాగమణి, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం
ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం ఎంపీయూపీ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఎస్.తేజ 60 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు అందజేశారు. సిద్దేశ్వరరావు మాట్లాడుతూ కంటి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీపీ.దస్తగిరి, రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరానికి స్పందన
బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం పశువైద్య సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 60 దూడలకు నట్టల నివారణ మందు, 50 గేదెలకు సూడు నిర్ధారణ, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు సుమారు 2 వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాపించారు. ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి లక్ష్మీనారాయణ, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధన
ప్రొద్దుటూరు కల్చరల్ : నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధన మంగళవారం ఘనంగా నిర్వహించారు. త్యాగరాజస్వామి చిత్రపటానికి విశేష పూజలు జరిపారు. ప్రత్యేక రథంపై స్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చి పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య అట్ట హాసంగా ఈ వేడుక నిర్వహించారు. దారి వెంబడి భక్తులు కొబ్బరి కాయలు కొట్టారు. నిర్వాహకులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి
ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో సరఫరా చేసే నీటిని ప్రజలు పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. మెగా ఇంజినీరింగ్ వర్క్స్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అమృత్ పథకం కింద ఏర్పాటుచేసిన పంపింగ్ లైన్‌కు బుధవారం లీకేజీ పనులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పట్టణంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు రోజు మార్చి రోజు నీటి సరఫరా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.